సాక్షి
జగిత్యాల
గురువారం । 24 । ఆగస్టు । 2023



మెట్‌పల్లి : వెల్లుల్లలో సంబురాలు జరుపుకుంటున్న గ్రామస్తులు

గర్వంగా.. మురవంగా..

- జిల్లావ్యాప్తంగా చంద్రయాన్‌–3 సంబరాలు
- ఉత్కంఠగా వీక్షించిన ప్రజలు, విద్యార్థులు
- ఊరూవాడ ర్యాలీలు.. జాతీయజెండాతో వేడుకలు

జగిత్యాలటౌన్‌/కోరుట్ల/మెట్‌పల్లి/కథలాపూర్‌ : జాబిల్లిపై త్రివర్ణ పతాకం రెపరెపలాడిన వేళ.. మునివేళ్లపై నిల్చున్న ప్రతీ భారతీయుడు ఆకాశమెత్తు ఎగిరి గంతేశాడు. చంద్రయాన్‌–3 ప్రయోగం విజయవంతం కావడంతో జిల్లా వ్యాప్తంగా సంబురాలు మిన్నంటాయి. బుధవారం సాయంత్రం టీవీలకే అతుక్కుపోయిన జనం.. నరాలు తెగే టెన్షన్‌ మధ్య చందమామపై విక్రమ్‌ ల్యాండ్‌ అవుతున్న దృశ్యాలను చూశారు. ప్రయోగం సక్సెస్‌ కావడంతో సంబరాల్లో మునిగితేలారు. స్వీట్లు పంచిపెట్టారు. టపాకాయలు కాల్చారు. వివిధ పాఠశాలల విద్యార్థులు జాతీయ జెండాలతో ర్యాలీలు నిర్వహించారు.



ప్రయోగాలకు అనుకూలం



చంద్రయాన్‌–3 సక్సెస్‌ కావడం మనకు గర్వకారణం. దీనికి కృత్రిమ మేథా అమర్చి ప్రత్యేకత చాటారు. దీనిద్వారా భూమిపై ఖనిజ వనరులను గుర్తించవచ్చు. భవిష్యత్‌ ప్రయోగాలకు ఇది ఎంతో అనుకూలం. చంద్రుడి దక్షిణ ధృవం వద్ద కాలుమోపి మనదేశం చరిత్రపుటల్లో తిరుగులేని రికార్డు సొంతం చేసుకుంది. శాస్త్రవేత్తలకు అభినందనలు.
– బాజోజి శ్రీనివాస్‌, జిల్లా సైన్స్‌ అధికారి

సాంకేతికత అభివృద్ధి



చంద్రుడి దక్షిణ ధృవం వద్ద ఏ దేశం కూడా వ్యోమనౌకను సురక్షితంగా దించలేదు. ఆ రికార్డు మన దేశం సొంతం చేసుకుంది. దీనిద్వారా చంద్ర మండలంలో నివాసాలకు అనుకూలమైన వాతావరణం ఉంటుందా? అనే విషయంలో అన్వేషణ జరపవచ్చు. ప్రయోగ దృశ్యాలను టీవీలో విద్యార్థులతోపాటు నేనూ చూసి ఉత్కంఠకు లోనయ్యా.
– అనిత, ఫిజికల్‌ సైన్స్‌ టీచర్‌, కేజీబీవీ

న్యూస్‌రీల్‌

'మహిళలపై వివక్ష ఏమిటి?'



నిరసన తెలుపుతున్న రెండో ఏఎన్‌ఎంలు

జగిత్యాలటౌన్‌: ప్రజల ఆరోగ్య సంరక్షణపై అవగాహన కల్పిస్తున్న రెండో ఏఎన్‌ఎంలను క్రమబద్ధీకరించడకుండా రోడ్డెక్కే పరిస్థితి తేవడం బాధాకరమని మహిళా కాంగ్రెస్‌ రాష్ట్ర కార్యదర్శి తాటిపర్తి శోభారాణి విమర్శించారు. ఆంక్షలు లేకుండా కాంట్రాక్ట్‌, ఔట్‌సోర్సింగ్‌ ఏఎన్‌ఎంలను క్రమబద్ధీకరించాలని డిమాండ్‌ చేశారు. నిరవధిక సమ్మె చేస్తున్న రెండో ఏఎన్‌ఎంల 8వ రోజు సమ్మె శిబిరాన్ని ఆమె బుధవారం సందర్శించారు. ఎమ్మెల్సీ కవిత చొరవ తీసుకుని క్రమబద్ధీకరణకు సహకరించాలని కోరారు. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ నిరసనలో రెండో ఏఎన్‌ఎంల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గాండ్ల మధురిమ, ప్రతినిధులు గూడూరి జయప్రద, మమత, పద్మ, స్వరూపరాణి, సుమలత, సుప్రియ, ఎలిజబెత్‌, రాజమణి, మధులత, ఊర్మిళ, రమ, ప్రమీల, కోమల, సునీత తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య కార్పొరేషన్‌ ఏర్పాటు చేయండి



మాట్లాడుతున్న నాయకులు

జగిత్యాల: రూ.2వేల కోట్లతో ఆర్యవైశ్య కార్పొరేషన్‌ ఏర్పాటు చేయాలని ఆర్యవైశ్య హక్కుల పోరాట సమితి నాయకులు డిమాండ్‌ చేశారు. పట్టణంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. పేదలకు రూ.లక్ష ఆర్థిక సాయం చేయాలని డిమాండ్‌ చేశారు. 6శాతం జనాభా ఉన్న తమకు రాజకీయ పరంగా ఒకేఒక్క కేటాయించారని, 1.50 శాతం ఉన్న వెల్మలకు 11 సీట్లు కేటాయించారని విమర్శించారు. నాయకులు కమటాల శ్రీనివాస్‌, చంద్రమౌళి, నాగరాజు, ప్రకాశ్‌, శివకుమార్‌, జగన్‌, పాపన్న పాల్గొన్నారు.

కనీస వేతనం చెల్లించండి



ర్యాలీ నిర్వహిస్తున్న ఆశ వర్కర్లు

జగిత్యాలటౌన్‌: గర్భిణుల ఆరోగ్య పరిరక్షణతోపాటు సంక్షేమ పథకాలను విజయవంతంగా అమలు చేయడంలో కీలకంగా వ్యవహరిస్తున్న తమకు కనీస వేతనం వర్తింపజేసి, ఉద్యోగ భద్రత కల్పించాలని ఆశ వర్కర్లు విజ్ఞప్తి చేశారు. స్థానిక టౌన్‌హాల్‌ నుంచి కలెక్టరేట్‌కు ర్యాలీ నిర్వహించారు. అక్కడ నిరసన వ్యక్తం చేశారు. తమకు చెల్లిస్తున్న పారితోషికం సరిపోవడం లేదన్నారు. అనంతరం పలు సమస్యలపై కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేశారు. ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పట్టణానికే పరిమితం చేయాలి

జగిత్యాలటౌన్‌: మాస్టర్‌ ప్లాన్‌ను జగిత్యాల పట్టణానికే పరిమితం చేయాలని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి డిమాండ్‌ చేశారు. స్థానిక ఇందిరాభవన్‌లో పట్టణ సమీప గ్రామాల యువకులు బుధవారం కాంగ్రెస్‌ పార్టీలో చేరారు. ఆయన మాట్లాడుతూ, మాస్టర్‌ప్లాన్‌లో పరిసర గ్రామాలను చేర్చి రిక్రియేషన్‌, ఇండస్ట్రియల్‌ జోన్లుగా విభజిస్తే రూ.కోట్ల విలువైన వ్యవసాయ భూములకు విలువ లేకుండా పోయే ప్రమాదం ఉందన్నారు. నాయకులు గిరి నాగభూషణం, రఘువీర్‌గౌడ్‌, దేవేందర్‌రెడ్డి, గుండ మధు, చాంద్‌పాషా తదితరులు ఉన్నారు.

108 రోజుల 'అసెంబ్లీ' ఆట

- ఎన్నికల వేళ అన్ని పార్టీల అభ్యర్థుల ముందు ఖర్చుల కొండ
- ఇక నుంచి ప్రతీ పండుగ బాధ్యత వారిదే..
- 'కోడ్‌' వచ్చేలోగా రూ.2, 3 కోట్లకుపైగా వదులుకోవాల్సిందే..
- ఓటర్లు, కార్యకర్తలు, నాయకులకు మొదలైన మర్యాదలు
- కేడర్‌ సహకారం, వెన్నుపోట్లపై భయాలు



సాక్షిప్రతినిధి, కరీంనగర్‌: 108.. ఇది ఎమర్జెన్సీ అంబులెన్స్‌ నంబర్‌ కాదు.. అదేదో వ్రతం కోసం గుడి చుట్టూ చేసే ప్రదక్షిణలు కావు.. వచ్చే డిసెంబర్‌లో జరిగే ఎన్నికలకు కాస్త అటూ ఇటుగా ఉన్న రోజులు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా పోటీ చేద్దామనుకుంటున్న అధికార, విపక్ష పార్టీల అభ్యర్థులు తమ కళ్ల ముందు మెదులుతున్న ఖర్చుల కొండను తలుచుకొని, బెంబేలెత్తుతున్నారు. అధికార బీఆర్‌ఎస్‌ ఎన్నికలకు సమరశంఖం పూరించడం, మరోవైపు మిగిలిన పార్టీల్లోనూ ఆశావహులు పోటీకి సిద్ధమవుతున్నారు. కానీ ఎన్నికల్లో రానూరాను ఖర్చులు పెరుగుతుండటం అభ్యర్థులను కలవరపెడుతోంది. నామినేషన్‌, ప్రచారం, పోలింగ్‌ ఇవన్నీ ఒక ఎత్తయితే, దానికి ముందే ఎన్నికల వాతావరణం రావడంతో ఇటు కేడర్‌ను, అటు ప్రజలను ఆకట్టుకునేందుకు నేతలు రూ.లక్షలు కుమ్మరించాల్సిన పరిస్థితి. ఓటర్లు మొదలుకొని కార్యకర్త, నాయకుల వరకు ఇప్పటికే మర్యాదలు మొదలయ్యాయి.

వెళ్లాల్సిందే.. కట్నాలు చదివించాల్సిందే

ప్రతీ నియోజకవర్గంలో అన్ని రకాల కులాలు, మతాల ఓటర్లు ఉంటారు. మహిళలు, వృద్ధులు, యువత, ఉద్యోగులు, నిరుద్యోగులు, దివ్యాంగులు, వితంతువులు.. ఇలా అన్ని వర్గాల వారిని ఆకట్టుకోవాల్సిన బాధ్యత ఎమ్మెల్యే ఆశావహులదే. ఇందుకు అధికార పార్టీ నుంచి ప్రతిపక్ష నాయకుల వరకు ఎవరూ అతీతులు కారు. దీంతో ఇకపై నియోజకవర్గంలో జరిగే ప్రతీ పండుగ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. చావు, పుట్టుక, పుట్టిన రోజు, పెళ్లిరోజు, సారీ ఫంక్షన్‌, సంతాప సభ, సన్మానాలు, కులసంఘాల సమావేశాలు, ఆత్మీయ సమ్మేళనాలు, ఉద్యోగ విరమణల నుంచి గృహ ప్రవేశాల వరకు ప్రతి సందర్భానికీ వెళ్లాల్సిందే.. కట్నకానుకలు చదివించాల్సిందే.

డజన్‌కు పైగా పండుగలు

ఆగస్టు 25వ తేదీన వరలక్ష్మీ వ్రతం, 31న రాఖీ, సెప్టెంబర్‌ 6న కృష్ణాష్టమి, 18న వినాయక చవితి, 28న వినాయక నిమజ్జనం/మిలాద్‌–ఉన్‌–నబీ, అక్టోబర్‌ 2న గాంధీ జయంతి, 23న సద్దుల బతుకమ్మ, 24న దసరా, నవంబర్‌ 13న దీపావళి, 14న బాలల దినోత్సవం, 27న కార్తీక పౌర్ణమి.. ఇలా ఎన్నికలు ముగిసేలోగా.. డజన్‌కు పైగా పండుగలను ప్రజలు గుర్తుంచుకునేలా జరిపే బాధ్యత అభ్యర్థులు, ఆశావహులదే.

'కోడ్‌' కూశాక అసలు ఆట

ఈ 108 రోజుల్లో కేడర్‌ను చూసుకునేందుకు రోజుకు రూ.లక్ష అయినా ఖర్చవుతుంది. ఇక దసరాకు కాస్త అటూఇటుగా ఎన్నికల కోడ్‌ వచ్చే అవకాశాలున్నాయి. అధికార పార్టీకి అంతోఇంతో పార్టీ నుంచి, వివిధ వర్గాల నుంచి ఆర్థిక సహకారం లభిస్తుంది. కానీ, ప్రతిపక్షాలకు ఆ అవకాశాలు చాలా తక్కువ. పోస్టర్లు, ప్రచారం, సభలు, సమావేశాలు, యాడ్స్‌, ఫ్లెక్సీలు, ఇంటింటి ప్రచారాలు, పాదయాత్రలు అంటూ ఎమ్మెల్యే అభ్యర్థులు, ఆశావహుల జేబులకు చిల్లులు పడేది ఈ సమయంలోనే. అటు తర్వాత చేసే ఖర్చు లెక్కలను ఎన్నికల సంఘానికి చెప్పాల్సి ఉంటుంది. బయటకు కనబడకుండా ఓటరు మహాశయులను ప్రసన్నం చేసుకునేందుకు పరిమితికి మించి ఖర్చు చేయాలి. అదే సమయంలో పక్కనే ఉంటూ వైరిపక్షాలకు సాయపడే వెన్నుపోటుదారులను తలచుకొని, నేతలు గుబులు పడుతున్నారు.

ఆస్తులు అమ్ముకునేందుకు సిద్ధం

జీవితంలో ఒక్కసారైనా ఎమ్మెల్యే కావాలనుకునేవారు, ఈసారి కాకుంటే ఇంకెప్పటికీ కాలేమన్న ఆలోచనలో ఉన్నవారు ఈసారి సర్వశక్తులు ఒడ్డేందుకు సిద్ధమయ్యారు. చివరికి పార్టీలో, నలుగురిలో తాము ధనవంతులమే అని చాటుకునేందుకు ఆస్తులు అమ్మేందుకు, మరికొందరు కుదవపెట్టేందుకు సంసిద్ధులుగా ఉన్నారు. ఈరోజుల్లో నాయకుడు బయటికి వచ్చాడంటే.. కనీసం నాలుగైదు కార్ల కాన్వాయ్‌ తప్పనిసరి. వాటిలో పెట్రోలు కొట్టించాలి. ప్రతీ కారులో ఐదారుగురు అనుచరులు, కాన్వాయ్‌ రాగానే జిందాబాద్‌లు కొట్టేందుకు యువత, బైక్‌ల వెంట జెండాలు పట్టుకొని తిరిగే కార్యకర్తలు, మంగళహారతులు ఇచ్చేందుకు మహిళలు ఉండాలి. ప్రతీనాయకుడు కనీసం 100 మందికి ఈ మూడు నెలలపాటు రూ.8 వేల నుంచి రూ.10 వేల వరకు వేతనాలు ఇవ్వాల్సిందే. రోజూ వారి వాహనాల్లో పెట్రోలు కొట్టించడం, భోజనాలు, చేతి ఖర్చులు, రాత్రి రాచమర్యాదలు సరేసరి. ప్రతీ నాయకుడు ఎంతలేదన్నా రూ.2, 3 కోట్లకుపైగానే ఖర్చు చేయాల్సి ఉంటుంది.

సంజయ్‌ను గెలిపించండి



కోరుట్లలో బీఆర్‌ఎస్‌ శ్రేణుల బైక్‌ ర్యాలీ

- ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు



మాట్లాడుతున్న విద్యాసాగర్‌రావు, సంజయ్‌

కోరుట్ల/మెట్‌పల్లిరూరల్‌: అసెంబ్లీ ఎన్నికల్లో తన కుమారుడు డాక్టర్‌ కల్వకుంట్ల సంజయ్‌ను ఆశీర్వదించి భారీ మెజారిటీతో గెలిపించాలని కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు కోరారు. సీఎం కేసీఆర్‌ తన కుమారుడిని కోరుట్ల ఎమ్మెల్యే బీఆర్‌ఎస్‌ అభ్యర్థిగా ప్రకటించిన అనంతరం హైదరాబాద్‌ నుంచి బుధవారం కోరుట్లకు చేరుకున్న ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు, బీఆర్‌ఎస్‌ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్‌ సంజయ్‌కు పార్టీ శ్రేణులు ఘనస్వాగతం పలికారు. మెట్‌పల్లి మండలం గండి హనుమాన్‌ ఆయలంలో తొలుత ప్రత్యేక పూజలు చేశాక.. అక్కడి నుంచి ర్యాలీగా కోరుట్ల సాయిబాబా ఆలయం వరకు చేరుకున్నారు. ఆలయంలో ప్రత్యేకపూజలు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే మాట్లాడారు. పార్టీ నాయకులు, కార్యకర్తల కోరిక మేరకు తన కుమారుడు డాక్టర్‌ సంజయ్‌ను ఎన్నికల బరిలో దించుతున్నామన్నారు. తాను పార్టీలకు అతీతంగా పనులు చేశానని, చివరి శ్వాస వరకూ ప్రజాసేవలోనే ఉంటానని అన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థి సంజయ్‌ మాట్లాడుతూ నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే నంబర్‌వన్‌గా నిలుపుతానన్నారు. 20 ఏళ్లుగా తన తండ్రికి చేదోడు వాదోడుగా నియోజకవర్గ ప్రజల సేవలో కొనసాగుతున్నానని తెలిపారు. తనకు నియోజకవర్గ ప్రజలు, సీఎం కేసీఆర్‌, తనతండ్రి విద్యాసాగర్‌రావు బాస్‌లని పేర్కొన్నారు. పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పనుల్లో వేగం పెంచాలి

జగిత్యాల: జిల్లాలో చేపట్టిన గ్రామపంచాయతీ భవన నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని, గృహలక్ష్మి పథకంలో లబ్ధిదారుల ఎంపిక త్వరితగతిన పూర్తిచేయాలని అదనపు కలెక్టర్‌ దివాకర ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్షించారు. జిల్లాకు 173 గ్రామపంచాయతీ భవనాలు మంజూరయ్యాయని, ఇప్పటివరకు 13 భవనాలు పూర్తయ్యాయని ఆయన తెలిపారు. ఎన్నికల కోడ్‌ వచ్చేలోపు అభివృద్ధి పనులు పూర్తిచేయాలని పేర్కొన్నారు. జిల్లాకు 31 లైబ్రరీలు మంజూరయ్యాయని, ఇందులో 6 పూర్తిచేయగా, మిగతావి పురోగతిలో ఉన్నాయన్నారు. జిల్లా పంచాయతీ అధికారి దేవరాజ్‌, ఆర్‌ అండ్‌ బీ ఈఈ శ్రీనివాస్‌ పాల్గొన్నారు.

నెలరోజుల పాటు ఓటరు నమోదు

కోరుట్లరూరల్‌: జిల్లాలో ఈనెల 21వ తేదీ నుంచి సెప్టెంబర్‌ 19వ వతేదీ వరకు కొత్త ఓటరు నమోదు ప్రక్రియ కొనసాగుతుందని ఆర్డీవో రాజేశ్వర్‌ తెలిపారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సెప్టెంబర్‌ 20 నుంచి 29వ తేదీ వరకు అభ్యంతరాలు, సూచనలు స్వీకరిస్తామని, అక్టోబర్‌ ఒకటిన జాబితా పరిశీలించి అదేనెల 4న తుది ఓటరు జాబితా విడుదల చేస్తామని చెప్పారు. అన్ని రాజకీయ పార్టీలు కొత్త ఓటరు నమోదుకు సహకరించాలని ఆయన కోరారు. తహసీల్దార్‌ కిషన్‌ తదితరులు పాల్గొన్నారు.

'బంగారు' స్వప్నికకు స్వాగతం



స్వప్నికకు స్వాగతం పలుకుతున్న పట్టణవాసులు, అభిమానులు, క్రీడాకారులు

- పవర్‌ లిఫ్టింగ్‌ పోటీల్లో ప్రతిభ
- నాలుగు స్వర్ణాలు సాధించిన విరించి



విరించి స్వప్నికతో తల్లిదండ్రులు, కోచ్‌

ధర్మపురి: అంతర్జాతీయ వేదికపై పవర్‌ లిఫ్టింగ్‌ పోటీల్లో నాలుగు బంగారు పతకాలు సాధించి మన త్రివర్ణ పతాకాన్ని రెపరెపలాడించిన రంగు విరంచి స్వప్నిక బుధవారం పట్టణానికి చేరుకున్నారు. ఈసందర్భంగా పట్టణవాసులు, అభిమానులు, క్రీడాకారులు ఆమెకు ఘనస్వాగతం పలికారు. పట్టణానికి చెందిన రంగు వెంకటరమణ – శ్రీలత దంపతుల కూతురు విరంచి స్వప్నిక ఈనెల 16 నుంచి 21వ తేదీ వరకు షార్జా(దుబాయి)లో జరిగిన ఆసియా యూనివర్సిటీ స్థాయి కప్‌ క్లాసిక్‌ పవర్‌ లిఫ్టింగ్‌ పోటీల్లో ప్రతిభ చూపి బంగారు పతకాలు సాధించిన విషయం తెలిసిందే. వాటితో స్వస్థలానికి చేరుకున్న స్వప్నికకు యువకుల ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పలు వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. స్వప్నికకు ప్రసంశం జల్లు కురిపించారు. పూలమాలలు వేసి, శాలువాతో సన్మానించారు. అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లిన తల్లిదండ్రులు, కోచ్‌ రాజేందర్‌ను పట్టణవాసులు అభినందించారు.

తలుపు తడితే కేసీఆర్‌ సంక్షేమ పథకం

- మంత్రి కొప్పుల ఈశ్వర్‌



మాట్లాడుతున్న మంత్రి కొప్పుల ఈశ్వర్‌

జగిత్యాల: ఏ ఇంటి తలుపు తట్టినా సీఎం కేసీఆర్‌ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల లబ్ధి పొందిన కుటుంబాలే ఉంటాయని మంత్రి కొప్పుల ఈశ్వర్‌ అన్నారు. జెడ్పీ క్యాంప్‌ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పంట రుణమాఫీతో రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోందన్నారు. 'మీరు పాలించే రాష్ట్రాల్లో తెలంగాణలో అమలు చేసే పథకాలు అమలవుతున్నాయా చెప్పండి'అని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డిని ఉద్దేశించి మంత్రి ప్రశ్నించారు. బీఆర్‌ఎస్‌ అధికారంలోకి వచ్చాక రోళ్లవాగు ఆధునికీకరణ చేశామని తెలిపారు. అర్జెంట్‌గా అధికారంలోకి రావాలనే కాంక్షతో కాంగ్రెస్‌ అబద్ధపు మాటలతో ప్రజలను మభ్యపెడుతోందని దుయ్యబట్టారు. బీజేపీ పాలనలో దేశాన్ని నాశనం చేశారని పేర్కొన్నారు. జిల్లాలోని ఐదు నియోజకవర్గాల్లో బీఆర్‌ఎస్‌ అభ్యర్థులు అందరూ విజయం సాధిస్తారని ధీమా వ్యక్తం చేశారు. ఎమ్మెల్యేలు సంజయ్‌కుమార్‌, విద్యాసాగర్‌రావు, రవిశంకర్‌, డీసీఎంఎస్‌ చైర్మన్‌ శ్రీకాంత్‌రావు, జెడ్పీచైర్‌పర్సన్‌ దావ వసంత, జెడ్పీ వైస్‌ చైర్మన్‌ హరిచరణ్‌రావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌ చంద్రశేఖర్‌గౌడ్‌ తదితరులు పాల్గొన్నారు.

బలం మీరే – బలగం మీరే..

ధర్మపురి: 'బలం మీరే.. బలగం మీరే.. మరోసారి అవకాశమిస్తే.. ఐదేళ్లపాటు వెన్నంటి ఉంటానని మంత్రి కొప్పుల ఈశ్వర్‌ అన్నారు. రాయపట్నం నుంచి బైక్‌ ర్యాలీ ద్వారా ఆయన ధర్మపురి క్షేత్రానికి చేరుకోగా బీఆర్‌ఎస్‌ శ్రేణులు స్వాగతం పలికారు. కార్యకర్తలు, నియోజకవర్గ ప్రజలకు అండగా ఉంటానని అన్నారు. మంథని ఎమ్మెల్యే శ్రీధర్‌బాబుకు తాను చేసిన అభివృద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నానని మంత్రి అన్నారు. అనంతరం వివిధ అభివృద్ధి, సంక్షేమ తదితర కార్యక్రమాల్లో పాల్గొన్నారు. డీసీఎమ్మెస్‌ చైర్మన్‌ శ్రీకాంత్‌రెడ్డి, మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ సంగి సత్తమ్మ, ఎంపీపీ చిట్టిబాబు, జెడ్పీటీసీలు బత్తిని అరుణ, బాదినేని రాజేందర్‌, ఏఎంసీ చైర్మన్‌ అయ్యోరి రాజేశ్‌ తదితరులు పాల్గొన్నారు.

హామీలతో మోసగిస్తున్న ప్రభుత్వాలు

- మంథని ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు



మాట్లాడుతున్న శ్రీధర్‌బాబు

ధర్మపురి : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మోసపూరిత హామీలతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాయని మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబు విమర్శించారు. ధర్మపురి లక్ష్మీ నృసింహస్వామి ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ ఆధ్వర్యంలో బ్రాహ్మణ సంఘం భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం సంవత్సరానికి 2 కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చి విస్మరించిందన్నారు. నిరుద్యోగ యువతకు నిరుద్యోగ భృతి చెల్లిస్తామని సీఎం కేసీఆర్‌ ఎన్నికల్లో ఇచ్చిన హామీని తుంగలో తొక్కారన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ప్రభుత్వం దళితబంధు, బీసీబంధు, మైనార్టీ బంధు తదితర పథకాలతో ప్రజలను ప్రలోభపెడుతున్నారన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుతో ఇక్కడ ఎకరాకైనా నీరు రాలేదని, మెగా కంపెనీ ప్రయోజనం కోసమే ప్రాజెక్టు నిర్మించారని ఆరోపించారు. ధర్మపురి పుణ్యక్షేత్రాన్ని యాదాద్రి తరహాలో అభివృద్ధి చేసేందుకు రూ.500 కోట్లు ఇస్తానని ప్రకటించిన సీఎం ఒక శాతం అయినా ఖర్చు చేశారా? అని ప్రశ్నించారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్‌ అధికారంలోకి వస్తే అన్ని వర్గాలకు జరుగుతుందన్నారు. నియోజకవర్గంలోని వివిధ మండలాలకు చెందిన అధ్యక్షులు దినేశ్‌, శైలేందర్‌ రెడ్డి, రాములుగౌడ్‌, శ్రీనివాస్‌, యూత్‌ అధ్యక్షుడు ప్రసాద్‌, నాయకులు వేముల రాజేశ్‌, శ్రవణ్‌, తిరుపతి పాల్గొన్నారు.

క్లుప్తంగా

విరాళం అందజేత



విరాళం అందజేస్తున్న భక్తుడు

ధర్మపురి : శ్రీలక్ష్మీ నృసింహస్వామి దేవస్థానంలో చేపడుతున్న పలు అభివృద్ధి పనుల కోసం ఓ భక్తుడు లక్ష రూ.లక్ష విరాళం అందజేశాడు. కామారెడ్డి పట్టణానికి చెందిన బలరామన్ కేస్కర్ దేవస్థానం సీనియర్ అసిస్టెంట్ అలువాలు శ్రీనివాస్‌కు విరాళాన్ని అందజేశారు. ఈ సందర్భంగా దంపతులకు స్వామి వారి శేషవస్త్రం, ప్రసాదాలను అందజేశారు.

స్కాలర్‌షిప్‌కు దరఖాస్తు చేసుకోవాలి

జగిత్యాల: మెట్రిక్ స్కాలర్‌షిప్‌లకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి రాజ్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల్లో చదువుతున్న ఎస్సీ, ఎస్టీ బీసీ, ఓసీ, మైనార్టీ విద్యార్థులు కళాశాలల్లో ఆన్‌లైన్ స్కాలర్‌షిప్‌లు దర్‌ఖాస్తు చేసుకునేందుకు ఈనెల 19 నుంచి డిసెంబర్ 31 వరకు ఈపాస్ వెబ్‌సైట్ అందుబాటులో ఉంటుందన్నారు.

పోలీసు కస్టడీలో నిందితులు

కోరుట్ల: పట్టణంలో ఇటీవల కౌన్సిలర్ భర్త పోగుల లక్ష్మీరాజంను హత్య చేసిన నిందితులను కోరుట్ల పోలీసులు తిరిగి బుధవారం కస్టడీలోకి తీసుకున్నారు. హత్య అనంతరం తొమ్మిది మంది నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించగా అందులో నలుగురిని మళ్లీ కస్టడీకి తీసుకొని హత్య పూర్వాపరాలను విచారిస్తున్నారు.

ఆలయంలో చోరీ

మల్యాల(చొప్పదండి): మండలంలోని రాంపూర్ శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఉత్సవమూర్తులను గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. ఆలయంలోకి చొరబడి పంచ లోహ ఉత్సవ మూర్తుల విగ్రహాలు ఎత్తుకెళ్లారు. విగ్రహాల విలువ సుమారు రూ.2.50లక్షలు ఉంటుందని ఆలయ కమిటీ చైర్మన్ సంగ ఎర్రన్న తెలిపారు. ఎర్రన్న ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి ఘటనా స్థలిని పరిశీలించారు.

ముగ్గురిపై కేసు

జగిత్యాలక్రైం: అదనపు కట్నం కోసం వేధించిన భర్త, మామ, అత్తపై కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్సై సధాకర్ తెలిపారు. జగిత్యాల అర్బన్ మండలం గోపాల్‌రావుపేటకు చెందిన గంగధరి గంగమణిని ధర్మపురి మండలం నేరెళ్లకు చెందిన మల్లేశంకు ఇచ్చి వివాహం చేశారు. కొంతకాలంగా భర్త మల్లేశం, అత్త సత్తవ్వ, మామ లస్మయ్య అదనపు కట్నం కోసం వేధిస్తున్నారని బాధితురాలు బుధవారం రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

అప్పుల బాధతో ఆటోడ్రైవర్ ఆత్మహత్య

తంగళ్లపల్లి(సిరిసిల్ల): అప్పుల బాధతో ఓ ఆటో డ్రైవర్ ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. వారి వివరాల ప్రకారం.. తంగళ్లపల్లి మండలంలోని మండెపల్లి కేసీఆర్ నగర్‌కు చెందిన బండారి బాలకుమార్(35) ఆటోడ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. మంగళవారం రాత్రి భోజనం చేసి, నిద్రపోయాడు. బుధవారం ఉదయం అతని భార్య లావణ్య లేచి చూసేసరికి పక్క గదిలో ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. మృతుడికి ముగ్గురు కూతుళ్లు ఉన్నారు. చిన్న కూతురుకు ఫిట్స్ ఉండటం, రూ.4 లక్షల వరకు అప్పులు ఉండడంతో మనస్తాపానికి గురై, ఆత్మహత్య చేసుకున్నట్లు మృతుడి భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేశారు.



జగిత్యాలలో చంద్రయాన్- 3 లైవ్ టెలికాస్ట్ వీక్షిస్తున్న విద్యార్థినులు



'ఇస్రో' ఇంగ్లిష్ అక్షరాల ఆకారంలో విద్యార్థులు



అబుదాబిలో సంబరాలు నిర్వహిస్తున్న తెలంగాణ ఫ్రెండ్స్ అసోసియేషన్ సభ్యులు

సక్సెస్‌పై సంబురాలు

- టపాసులు పేల్చి.. మిఠాయిలు పంచి..
- ఆనందం పంచుకున్న జిల్లావాసులు
- చంద్రయాన్–3 విజయవంతంపై హర్షం

జగిత్యాలటౌన్: చంద్రయాన్–3 సక్సెస్‌పై జిల్లావ్యాప్తంగా సంబురాలు అంబరాన్నంటాయి. వివిధ ప్రాంతాలకు చెందిన విద్యార్థులు, ఉపాధ్యాయులు, విద్యార్థి, యువజన సంఘాలు, రాజకీయాలకు అతీతంగా వివిధ పార్టీల నాయకులు బుధవారం ఉదయం నుంచే చంద్రయాన్ –3 లాండింగ్‌పై ఆసక్తిగా ఎదురు చూశారు. సాయంత్రం వరకు టీవీలు, మొబైల్ ఫోన్లకు అతుక్కుపోయారు. ల్యాండింగ్ సక్సెస్ కావడంతో ఆనందంతో బాణసంచా కాల్చారు. మిఠాయిలు పంపిణీ చేశారు. జిల్లా కేంద్రంలోని కస్తూరిబా బాలికల విద్యాలయంలోని స్క్రీన్‌పై చంద్రయాన్–3 ప్రయోగాన్ని లైవ్‌గా వీక్షించారు. లాండింగ్ విజయవంతం కావడంతో ఉపాధ్యాయులు, విద్యార్థినులు హర్షం వ్యక్తం చేశారు. వారు ఏమన్నారంటే..

జయహో ఇస్రో

కథలాపూర్ : బొమ్మెన ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు 'జయహో ఇస్రో' ఇంగ్లిష్ అక్షరాల ఆకారంలో కూర్చుని తమ అభిమానం చాటుకున్నారు.

అబుదాబిలో

రాయికల్: తెలంగాణ ఫ్రెండ్స్ అసోసియేషన్ సభ్యులు రాజశ్రీనివాస్‌రావు, గోపాల్, శ్రీనివాస్, ఐఎస్‌సీ ప్రధాన కార్యదర్శి ప్రదీప్‌కుమార్ ఆధ్వర్యంలో అబుదాబిలో సంబురాలు నిర్వహించారు.

దుబ్బరాజన్న ఆలయంలో పూజలు

సారంగాపూర్(జగిత్యాల): చంద్రయాన్–3 విజయవంతం కావడంపై దుబ్బరాజన్న ఆలయంలో పెంబట్ల, కోనాపూర్ గ్రామస్తులు, అధికారులు ప్రత్యేక పూజలు చేశారు. ఈవో అనూష, సర్పంచ్ బొడ్డుపల్లి రాజన్న, రైతు సమన్వయ సమితి మండల కన్వీనర్ కోల శ్రీనివాస్, వీడీసీ సభ్యులు తేలు నరేశ్, బొక్కల రమేశ్, తేలు గంగన్న తదితరులు ఉన్నారు.

దేశానికే గర్వకారణం

జగిత్యాలటౌన్: స్థానిక తహసీల్ చౌరస్తాలో భారత్ సురక్షా సమితి ఆధ్వర్యంలో టపాసులు పేల్చి, మిఠాయిలు పంచి సంబురాలు చేసుకున్నారు. ప్రతినిధులు అక్కినపెల్లి కాశీనాథం, అరవ లక్ష్మి, వేముల పోచమల్లు, సిరిపురం గంగారం పాల్గొన్నారు.

కోరుట్లలో..

కోరుట్ల : కౌన్సిలర్ పెండెం గణేశ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సంబురాల్లో మాసం ప్రసాద్, కసుల గంగాధర్, రంజిత్ రావు, జక్కుల ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

వెల్లుల్లలో..

మెట్‌పల్లి: గురుకులాలు, ప్రైవేట్ పాఠశాలల్లో బాణసంచా పేల్చి ఉపాధ్యాయులు, విద్యార్థులు సంబురాలు చేసుకున్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో..

జగిత్యాలటౌన్: బీజేపీ నాయకులు బీజీ పాటిల్, భోగ శ్రావణి, సత్యనారాయణరావు, పన్నాల తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో సంబురాలు ఘనంగా నిర్వహించారు.



పూజలు చేస్తున్న గ్రామస్తులు



సంబురాల్లో భారత్ సురక్షాసమితి సభ్యులు



కోరుట్లలో..



సంబరాల్లో బీజేపీ నాయకులు

మనకు గర్వకారణం



ధర్మపురి : చంద్రయాన్–3 విజయం మనకు గర్వకారణం. అంతరిక్షంలో మనం ప్రత్యేక గుర్తింపు పొందాం. శాస్త్రవేత్తలకు మనమందరం రుణపడి ఉంటాం.
– గొల్లపెల్లి గణేశ్, ప్రభుత్వ ఉపాధ్యాయుడు, ధర్మపురి

భవిష్యత్‌కు బాటలు



చంద్రయాన్ విజయం ఒక అద్భుతం. భవిష్యత్తులో మరిన్ని ప్రయోగాలకు ఇది స్ఫూర్తిని ఇచ్చింది.
– కె.మధులత, ప్రత్యేకాధికారి

లైవ్‌లో చూశాం



స్కూల్‌లో స్క్రీన్‌పై చంద్రయాన్– 3 రోవర్ ల్యాండింగ్ లైవ్‌గా చూడటం సంతోషం కలిగించింది.
– గంగమణి, విద్యార్థిని

కల నెరవేరింది



చంద్రాయాన్–3 ప్రయోగం విజయంతో భారత్ దశాబ్దాల కల నెరవేరినట్లయ్యింది. మరిన్ని ఆవిష్కరణలు అవకాశం కలిగింది.
– అయిత అనిత, ఉపాధ్యాయురాలు

శాస్త్రవేత్తల కృషి



టీచర్లు ఉదయం చంద్రయాన్–3 ప్రయోగం గురించి చెప్పారు. సాయంత్రం అందరం టీవీలో చూశాం. పుస్తకాల్లో చదివితే ఏదో అనుకున్నాం. టీవీలో చూశాక మన శాస్త్రవేత్తల కృషి ఎంతో ఉందని తెలిసింది. దీనిద్వారా మనదేశం టెక్నాలజీలో మరింత పురోగతి సాధించింది.
– గుగ్లొత్ లతిక, విద్యార్థిని, కేజీబీవీ, కథలాపూర్

మన సామర్థ్యం తెలిసింది



మెట్‌పల్లి: చంద్రయాన్–3 విజయవంతం ప్రపంచానికి భారత దేశ సామర్థ్యాన్ని చాటి చెప్పింది. దక్షిణ ధృవంపై అడుగుపెట్టిన తొలి దేశంగా భారత్ నిలవడం మనకు గర్వ కారణం.
– కోటగిరి ఆనందం, ప్రిన్సిపాల్, మెట్‌పల్లి

అంతరిక్ష రంగంలో భారత్ చరిత్ర సృష్టించింది



గొల్లపల్లి: చంద్రుడి ఉపరితలం దక్షిణ ధృవంపై విక్రం లాండర్ సాఫ్ట్ ల్యాండింగ్ కావడం అంతరిక్ష రంగంలో భారత దేశం చరిత్ర సృష్టించింది. జాబిల్లి దక్షిణ ధృవంపై అడుగుపెట్టి తొలి దేశంగా రికార్డు సృష్టించడం అభినందనీయం. రష్యా విఫలమైన చోట భారత్ విజయబావుటా ఎగురవేసింది. ఇస్రో శాస్త్రవేత్తల 4 ఏళ్ల కఠోర శ్రమతో దశాబ్దాల కల సాకారమైన వేళ భరత శాస్త్రవేత్తలకు ప్రత్యేక ధన్యవాదములు.
– బైరేని రమణరావు,సైన్స్ ఉపాధ్యాయుడు, మల్లన్నపేట జెడ్పీహెచ్ఎస్

అభినందనలు



రోవర్ విజ్ఞాన్ లాండింగ్‌ను టీవీలో ప్రత్యక్షంగా చూడటం అద్భుతం. ఇందులో పాలుపంచుకున్న శాస్త్రవేత్తలకు అభినందనలు.
– శాలిని, విద్యార్థిని, పురాణిపేట

ఎస్సై, ఏఎస్సై అభ్యర్థులకు వైద్య పరీక్షలు

- రాజన్న జోన్ డీఐజీ కే.రమేశ్‌నాయుడు



కె.రమేశ్‌నాయుడు

కరీంనగర్‌క్రైం: పోలీసుశాఖలోని వివిధ విభాగాల్లో (సివిల్, ఆర్మ్‌డ్ రిజర్వు, ఎస్పీఫ్, స్టేషన్ ఫైర్ ఆఫీసర్, డిప్యూటీ జైలర్) ఎస్సై / ఏఎస్ఐ(ఫింగర్ ప్రింట్ బ్యూరో, కమ్యూనికేషన్) నియామకాలకు అర్హత సాధించిన జోన్–ఐఐఐ అభ్యర్థులకు ఈనెల 26 నుంచి 28వరకు వైద్య ఆరోగ్య పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని రాజన్న సిరిసిల్ల జోన్ డిప్యూటీ ఇన్స్‌పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (ఈఐఏ) కె.రమేశ్ నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. వరంగల్ ప్రభుత్వ ఆసుపత్రిలో ఈ వైద్య పరీక్షలు ఉంటాయని తెలిపారు. జోన్ నుంచి ఎంపికైన 45మంది అభ్యర్థులు వైద్యపరీక్షల నిమిత్తం ఈనెల 25న సాయంత్రం ఐదుగంటలకు కరీంనగర్ కమిషనరేట్ కేంద్రంలోని సీఏఆర్ ఏసీపీ/ఆర్ఐ అడ్మిన్ ఎదుట హాజరుకావాలని పేర్కొన్నారు.

బీజేపీ నాయకుల అరెస్టు



పోలీస్‌స్టేషన్‌లో నాయకులు

ధర్మపురి : పట్టణంలో బీజేపీ నాయకులను పోలీసులు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. ప్రభుత్వ మోస పూరితమైన వాగ్దానాలతో ప్రజలను మోసం చేస్తుందని, గతంలో ఇచ్చిన హామీలను అములచేయాలని కోరుతూ అసెంబ్లీ కన్వీనర్ కస్తూరి సత్యం ఆధ్వర్యంలో బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ముట్టడికి యత్నించగా పోలీసులు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా కన్వీనర్ కస్తూరి సత్యం మాట్లాడుతూ .. బడుగు బలహీన వర్గాల సమస్యల కోసం పోరాటం చేస్తున్న బీజేపీ నాయకులను అరెస్టు చేయడం సరికాదన్నారు. ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ ఈనెల 24, 25న మంత్రుల పర్యటన సందర్భంగా కలెక్టరేట్ కార్యాలయాలను ముట్టడిస్తామన్నారు. చంద్రశేఖర్, మంచె రాజేశ్, బండారు లక్ష్మణ్, ఆకుల శ్రీనివాస్, లవణ్‌కుమార్, గాజు భాస్కర్, దివిటి శ్రీధర్ తదితరులున్నారు.

ధాన్యానికి రక్షణ కవచం

- ఈనెల 15న ఇన్నోవేషన్‌ను ప్రదర్శించిన ఉపాధ్యాయురాలు సుమతి
- జిల్లా, రాష్ట్రస్థాయికి ఎంపిక
- ఇప్పటి పలు ప్రదర్శనల్లో బహుమతుల ప్రదానం





ఇబ్రహీంపట్నం: రైతులు పండించిన ధాన్యం చేతికొచ్చిన తర్వాత అకాలవర్షం, కోతులు, ఇతర జంతువులతో నష్టపోవాల్సి వస్తోంది. ధాన్యాన్ని రక్షించేందుకు గాను ఇంటింటా ఇన్నోవేటర్ పథకం ద్వారా ప్రదర్శించి పలు అవార్డు అందుకున్నారు ఓ ఉపాధ్యాయురాలు. మండలంలోని గోధూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలోని ఉపాధ్యాయురాలు కులవర్తి సుమతి ధాన్యాన్ని రక్షించే కవచాన్ని తయారు చేశారు.

ఇన్నోవేషన్ తయారీకి పరికరాలివే..

బియ్యం, కాలి బియ్యపు సంచులు, ఖాళీ ఎరువుల బస్తాలు, వాటర్‌ప్రూఫ్ షీట్, నలుపు రంగు క్లాత్‌తో వ్యాసార్థంగా కుట్టి దాని చుట్టూ నైలాన్ తాడు బిగిస్తారు. రైతులు తాటిపత్రిలు వాడుతారు కాబట్టి అంత సైజులో తయారు చేసేందుకు సుమారు రూ.1500 ఖర్చు అవుతుంది. ఇది రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. కవచంలో రైతులు ధాన్యాన్ని అరబెట్టినప్పుడు దానికి అమర్చిన నైలాన్ తాడును లాగినట్లయితే షీట్ అంచులుపైకి వచ్చి ఒక అర్ధ వృత్తాకార గిన్నెలాగా తయారు అవుతుంది. ఎక్కువ ధాన్యం అరబెట్టుకోవచ్చు. అంచున ఉన్న తాడును లాగి ముడి వేసుకుంటే వర్షానికి ధాన్యం తడవదు. మరుసటి రోజు మళ్లీ పొలంలో ఆరబెట్టుకోవచ్చు. కూరగాయలు, చిరు ధాన్యాలు ప్రత్యేకంగా వేరే బుట్టలు అవసరం లేకుండా మార్కెట్ వరకు వెళ్లొచ్చు. చిరు వ్యాపారులు వారి దుకాణంలోని ధాన్యం పురుగుపట్టకుండా ఆరబెట్టేందుకు, అలాగే నిల్వచేసేందుకు ఉపయోగపడుతుంది. వేసవిలో ట్రాక్టర్లలో అమ్మే మిర్చి రైతులకు ఈ పోర్టెబుల్ అంబ్రెల్లా ఎంతో ఉపయోగపడుతుంది.

పలు అవార్డులు అందుకున్న సుమతి

2017లో జవహర్ నవోదయ గణిత నమునా అంశంలో జిల్లాలోనే ప్రథమ స్థానం, రాష్ట్రస్థాయిలో ద్వితీయ బహుమతి అందుకున్నారు. హైదరాబాద్‌లో నిర్వహించిన దక్షిణ భారత ప్రదర్శనలో ప్రదర్శించి దేశస్థాయికి చేరుకున్నారు. 2021లో ఇంటింటా ఇన్నోవేషన్‌లో భవనం ఎత్తులను కొలిచే పరికరం తయారు చేసి జగిత్యాలలో ప్రదర్శించగా జిల్లాస్థాయికి ఎంపికైంది. అప్పటి కలెక్టర్ రవి చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకున్నారు. 2022 డిసెంబర్‌లో జగిత్యాలలో నిర్వహించిన జవహర్ నవోదయ మ్యాథ్స్ ఎగ్జిబిషన్‌లో జిల్లా ప్రథమస్థాయికి ఎంపికకాగా మెట్‌పల్లి డివిజన్ లెవల్ మెట్‌పల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సైన్స్‌మేళాలో నిర్వహించిన ప్రదర్శనలో మొదటి బహుమతి అందుకున్నారు. 2023 జనవరి 26న జిల్లాలో మేజరింగ్ టాయ్‌ను తయారు చేసి ప్రదర్శించగా మొదటి బహుమతి తీసుకున్నారు. ఈనెల 15న స్వాతంత్ర్య దినోత్సవం వేడుకల్లో భాగంగా జగిత్యాలలో ఇంటింటా ఇన్నోవేషన్‌ను ప్రదర్శించగా జిల్లాస్థాయి, రాష్ట్రస్థాయికి ఎంపిక కావడంతో మంత్రి కొప్పుల ఈశ్వర్, జిల్లా కలెక్టర్ యాస్మిన్‌బాషా చేతుల మీదుగా ప్రశంసా పత్రాన్ని తీసుకున్నారు.

గణితంపై భయం పోగొట్టేందుకే



విద్యార్థుల్లో భయం పోగొట్టేందుకు ఇలాంటి ఆవిష్కరణలు దోహదపడతాయి. గణితంపై ఆసక్తితోపాటు సులభంగా అర్థమయ్యేలా బోధనా ఉపకరణాలు తయారు చేసి ప్రదర్శించాం. ముున్ముందు మరిన్ని తయారు చేసి ప్రదర్శిస్తాం. –సుమతి, ఉపాధ్యాయురాలు

అర్హులకే దళితబంధు అందించాలి



రాఘవపేటలో ధర్నా చేస్తున్న మహిళలు

మల్లాపూర్ : మండలంలోని రాఘవపేటలో దళితబంధు అమలులో తమకు అన్యాయం జరిగిందని ఖానాపూర్–మెట్‌పల్లి రహదారిపై మహిళలు ధర్నా చేపట్టి రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో దళితబంధును అర్హులైన వారికి కాకుండా అధికార పార్టీ నాయకులు చెప్పిన వారికే కట్టబెట్టారని ఆవేదన వ్యక్తంచేశారు. గ్రామంలో అర్హులైన వారికే దళితబంధు అందించాలని డిమాండ్ చేశారు. ఎస్సై నవీన్‌కుమార్, సిబ్బంది చేరుకొని సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

గల్ఫ్‌లో వేంపేట వాసి మృతి



రాంచందర్ రెడ్డి (ఫైల్)

మెట్‌పల్లి రూరల్ : జీవనోపాధి కోసం గల్ఫ్ వెళ్లిన ఓ వ్యక్తి గుండెపోటుతో మృతిచెందాడు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. మెట్‌పల్లి మండలం వేంపేటకు చెందిన ఒంటేరి రాంచందర్ రెడ్డి (60) పదినెలల క్రితం బెహరాన్ వెళ్లాడు. అక్కడ ఓ హోటల్‌ను లీజుకు తీసుకొని నడుపుతున్నాడు. ఇటీవల అగ్రిమెంట్ పూర్తికాగా మరోసారి తనకే లీజుకు కావాలని ఒప్పందం చేసుకునేందుకు సిద్ధమయ్యాడు. ఈనెల 22న ఉదయం గుండెపోటుతో మృతిచెందాడని అక్కడి వారు వేంపేట వాసులకు సమాచారం అందించారు. రాంచందర్ రెడ్డి మరణవార్త తెలుసుకున్న కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. మృతుడికి భార్య లలిత, ఇద్దరు కూతుళ్లు కాగా వారికి వివాహమైంది.మృతదేహాన్ని స్వగ్రామానికి త్వరగా తీసుకువచ్చేలా ప్రభుత్వం చొరవ తీసుకోవాలని మెట్‌పల్లి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అల్లూరి మహేందర్ రెడ్డి కోరారు.

కల్వర్టుపై దిగబడ్డ బండరాళ్ల ట్రాక్టర్

బోయినపల్లి(చొప్పదండి): కల్వర్టుపై బుధవారం ఓ బండరాళ్ల ట్రాక్టర్ దిగబడింది. బండరాళ్లు కింద పడిపోయి, ప్రమాదం తప్పింది. స్థానికుల కథనం ప్రకారం.. కరీంనగర్ జిల్లా కొత్తపల్లి మండలంలోని బావుపేట నుంచి బోయినపల్లి మీదుగా వేముల వాడరూరల్ మండలం వట్టెంలకు బండరాళ్లను తీసుకెళ్తున్న ట్రాక్టర్ బోయినపల్లి పరిసరాల్లోని కల్వర్టుపై ఒక్కసారిగా దిగబడింది. గత నెల 27న కురిసిన భారీ వర్షాలకు కల్వర్టు కోతకు గురైంది. తాత్కాలికంగా మట్టి పోసి రాకపోకలు పునరుద్ధరించారు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి నుంచి వర్షం కురవడంతో ట్రాక్టర్ దిగబడిందని స్థానికులు తెలిపారు. బండరాళ్లను కూలీలతో తీయించి, కల్వర్టు కుంగిన చోట జేసీబీ సహాయంతో మట్టిని నింపినట్లు పేర్కొన్నారు. శాశ్వత బ్రిడ్జి నిర్మాణం చేపట్టకపోవడంతో ఇక్కడ ఏటా ప్రమాదాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు.

రమణారావు జన్మదిన వేడుకలు



పెగడపల్లి: బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రత్యేక అహ్వానితుడు, పెగడపల్లి సహకార సంఘం చైర్మన్ వోరుగంటి రమణారావు జన్మదిన వేడుకలు బుధవారం జరిగాయి. ఈ మేరకు పెగడపల్లి మాజీ సర్పంచి తాటిపాముల రాజు రమణారావును కరీంనగర్‌లోని తన నివాసంలో కలిసి స్వీటు తినిపించి పుష్పగుచ్ఛం అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

డీసీఎం, ఆర్టీసీ బస్సు ఢీ..

సుల్తానాబాద్‌రూరల్: ఆర్టీసీ బస్సు, డీసీఎం ఢీకొన్న ఘటన బుధవారం పట్టణంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. గోదావరిఖని నుంచి కరీంనగర్ వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సును సుల్తానాబాద్ బస్టాండ్ వద్ద మంచిర్యాల వైపు వెళ్తున్న డీసీఎం వ్యాన్ ఢీ కొట్టింది. దీంతో ఎలాంటి ప్రాణాపాయం జరగకపోవడంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.